## పొన్నారిలో వడగండ్ల వాన



పొన్నారిలో కురిసిన వడగండ్ల వర్షం

తాంసి, మార్చి 25 : హస్నాపూర్, కప్పర్ల, జామిడి, బండల్ నాగపూర్‌తోపాటు ఆయా గ్రామాల్లో వర్షం కురిసింది. రెండు రోజులుగా చిరుజల్లులకే పరిమితమైన వర్షం ఒక్కసారిగా ఈదురు గాలులతో ఏకధాటిగా పడింది. సోమవారం సాయంత్రం పొన్నారి గ్రామంలో ఈదురుగాలులతోపాటు వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో పగలు ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు.. సాయంత్రం కురిసిన వర్షానికి కొంతమేర ఉపశమనం పొందారు. మరోవైపు చేనులో మిరప సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడ్డారు.

## మండుతున్న సూరీడు

సూర్య భగవానుడు మండిపోతున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మూడు రోజుల క్రితం వరకు చల్లబడ్డ వాతావరణం.. ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం రాష్ట్రంలోనే నిర్మల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధికం 41.1 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఫలితంగా రహదారులు నిర్మానుష్యంగా మారుతుండగా.. ప్రజలు శీతల పానీయాలను సేవిస్తున్నారు.

- నిర్మల్ అర్బన్, మార్చి 25



నిర్మానుష్యంగా రహదారి

# కలర్‌ఫుల్ రంగేసి.. చిందేసి..



నృత్యాలు చేస్తు రంగులు చల్లుతున్న ఎస్పీ,పోలీస్ సిబ్బంది



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో హోలీ సంబరాలు జరుపుకుంటున్న చిన్నారులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హోలీ వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం వేకువజాము నుంచే చిన్నారులు, యువతీ యువకులు, మహిళలు, పెద్దలు, వృద్ధులు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. యువకుల కేరింతలు, చిన్నారుల అల్లరి చేష్టలు, పెద్దలు ఒకరికొకరు రంగులు పూసుకునే చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గనులపై డోలు వాయిస్తూ నృత్యాలు చేశారు. గిరిజన గూడేలు, తండాల్లో మహిళలు సంప్రదాయ థీంసా దరువుకు చిందులేశారు. పర్యావరణం కలుషితం కాకుండా చిన్నారులు సహజ సిద్ధమైన గోగు పూలతో రంగులు తయారు చేసుకుని చల్లుకున్నారు. అనంతరం సమీప చెరువులు, కాలువలు, ప్రాజెక్టుల్లోకి వెళ్లి స్నానం చేశారు. తాంసి, నేరడిగొండ మండలాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తన స్వగ్రామం కల్లూర్‌గూడలో గ్రామస్తులు, బంధువులతో కలిసి హోలీ ఆడారు. ముథోల్‌లో స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ తన ఇంట్లో నిర్వహించిన హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.జిల్లా కేంద్రంలోని పోలీస్ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ గౌష్ ఆలం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి హోలీ ఆడారు. -నమస్తే నెట్‌వర్క్



కల్లూర్‌గూడ గ్రామస్తులతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



సంబురాల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్

# ఒకరి వెంట ఒకరు..

- వార్ధా నదిలో స్నానానికి వెళ్లి నలుగురు స్నేహితుల మృత్యువాత
- ఒకరిని కాపాడడానికి మరొకరు నదిలో దిగి కొట్టుకుపోయిన వైనం
- హోలీ ఆడుకుని స్నానాలు చేయడానికి వెళ్లడంతో ప్రమాదం
- నలుగురికి ఈత రాకపోవడమే మునిగిపోవడానికి ప్రధాన కారణం
- మరణంలోనూ వీడని స్నేహబంధం..
- నాలుగు కుటుంబాల్లో మిన్నంటిన రోదనలు..
- మృతదేహాలను పరిశీలించిన ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ కరుణాకర్
- మండల కేంద్రంలోని నదీమాబాద్‌లో విషాదఛాయలు



కౌటాల: మృత దేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్ కుమార్



పనాసా కమలాకర్(ఫైల్)



ఎల్ముల్లే ప్రవీణ్(ఫైల్)



ఆలం సాయి(ఫైల్)



ఉప్పల సంతోష్(ఫైల్)



మృత దేహాలను వార్ధా నదిలోంచి బయటకు తెస్తున్న జాలరులు

కౌటాల, మార్చి 25 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని నదీమాబాద్‌కు చెందిన ఆరుగురు స్నేహితులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. స్నానాలు చేసేందుకు మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలో గల వార్ధా నదికి వెళ్లారు. నదిలోకి దిగగానే ఆరుగురు స్నేహితుల్లో నవీన్‌కు ఫోన్ రావడంతో మళ్లీ వస్తానని ఇంటికి వెళ్లాడు. మిగతా ఐదుగురు స్నేహితులు స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. ఇందులో పనాస కమలాకర్(23), ఉప్పుల సంతోష్(22), ఎల్ముల్లే ప్రవీణ్(23), ఆలం సాయి(20) స్నానం చేయడానికి నీటిలో దిగగా.. సంతోష్ వస్తువులు, బట్టల వద్ద కాపలా ఉన్నాడు. స్నానానికి నదిలోకి దిగిన స్నేహితులు ఈత రాకపోవడంతో ఒకరి తర్వాత ఒకరు నీట మునిగారు. మొదటగా ప్రవీణ్ నదిలోకి దిగగా మునిగి పోతుండగా కమలాకర్ పట్టుకునే ప్రయత్నం చేశాడు. కమలాకర్ కూడా కొట్టుకుపోతుండగా ఉప్పుల సంతోష్ కాపాడే ప్రయత్నం చేశాడు. ఆయన కూడా కొట్టుకుపోతుండగా సాయి కాపాడే ప్రయత్నం చేసి.. నలుగురు కూడా కొట్టుకుపోయారు. నలుగురు స్నేహితులు నీటిలో మునగడాన్ని గమనించిన సంతోష్ కాపాడండి.. కాపాడండి అని కేకలు వేశాడు. ఆ లోపే నలుగురు స్నేహితులు మునిగిపోయారు. అక్కడే ఉన్న వారు కేకలు విని వచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. వెంటనే ఘటన స్థలంలోని వారు కౌటాల సీఐ సాదిక్‌పాషాకు సమాచారం అందించారు. తాటిపల్లి గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లను రప్పించి మృతదేహాల కోసం వెతికించారు. మూడు గంటలు వెతికి నలుగురి మృతదేహాలను బయటకు తీశారు.

### మిన్నంటిన కుటుంబీకుల రోదనలు

- నీట మునిగి మృతిచెందిన ఎల్ముల్లే ప్రవీణ్, పనాసా కమలాకర్, ఉప్పుల సంతోష్, ఆలం సాయిల కుటుంబ సభ్యుల రోదనలతో ఊరంతా దద్దరిల్లింది. అప్పటి వరకు గ్రామంలో అందరితో సరదాగా హోలీ వేడుకల్లో పాల్గొన్న స్నేహితులు.. ఇలా విగతజీవులుగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా.. ఎల్ముల్లే ప్రవీణ్‌కు యేడాది క్రితం వివాహమైంది. కుమారుడు ఉన్నాడు. ఉప్పుల సంతోష్ స్థానిక రైస్ మిల్లులో ఆపరేటర్‌గా, పనాసా కమలాకర్ డ్రైవర్‌గా, ఆలం సాయి ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. వీరికి పెండ్లిళ్లు కాలేదు.

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ


- విషయం తెలుసుకున్న ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ కరుణాకర్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కౌటాల సీఐ సాదిక్ పాషాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కౌటాల ఎస్సై మధూకర్, ఏఎస్సై దేవీసింగ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### మంచిర్యాల జిల్లాలో యువకుడు..



దండేపల్లి/జన్నారంమార్చి 25 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గోపులపురం ప్రశాంత్-అశ్విని దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భర్త ప్రశాంత్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. భార్య అశ్విని ఐదు రోజుల క్రితం పిల్లలను తీసుకుని మామిడిపెల్లికి వచ్చింది. ఇంటర్ చదివే కార్తిక్ తన స్నేహితులతో కలిసి ఉదయం 9 గంటలకు హోలి ఆడుకోవడానికి వెళ్లాడు. వేడుకల అనంతరం స్నానం చేయడానికి తానిమడుగు డెలివరీ పాయింట్ వద్ద నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి పోయాడు. గమనించిన అనిల్‌కుమార్, అరవింద్‌లు నీటి నుంచి బయటకు తీసేసరికి అపస్మారకస్థితోకి వెళ్లిపోయాడు. చికిత్స నిమిత్తం సమీపంలోని మేదరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి అశ్విని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు.

### ఆదిలాబాద్ జిల్లాలో బాలుడు..



ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్ నగర్‌కు చెందిన హర్షిత్(14) హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నాడు. అనంతరం ఆదిలాబాద్ మండలంలోని భీంసరి వాగులో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే మృతదేహాన్ని వెలికి తీశారు.

## వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం

జగిత్యాల టౌన్, మార్చి 25 : ఉత్తర తెలంగాణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని జిల్లా వ్యవసాయ అధికారులు, ఉద్యానవనశాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సుమారు 200 మంది రైతులు పాల్గొనను న్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి పాల్గొని వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని నివారించే దిశగా పరిశోధనలు చేపట్టే విధంగా దిశానిర్దేశం చేయనున్నారు.

## గూడెంలో పౌర్ణమి జాతర

దండేపల్లి, మార్చి 25 : గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం పౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయాన్నే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారి దర్శనానికి బారులు తీరారు. 124 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించాయి. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఈవో శ్రీనివాస్ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

# నోళ్లు తెరుస్తున్న పొలాలు

## సాగు నీరందక ఎండుతున్న పంటలు

- కరెంటు కోతలు, భూగర్భ జలాలు అడుగంటడమే సమస్య
- తగ్గిన సాగు.. నీటి విడుదలపై ఆంక్షలు..
- 20 వేల ఎకరాల పంటపై ప్రభావం

నిర్మల్ టౌన్, మార్చి 25 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా యాసంగిలో 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగువుతుందని అధికారులు అంచనా వేశారు. కాగా.. ఈసారి ప్రాజెక్టుల కింద వరి సాగు తగ్గింది. శ్రీరాంసాగర్ పరిధిలోని సరస్వతీ కెనాల్ కింద 36 వేల ఎకరాలకు 30 వేలు సాగయ్యాయి. దీనికితోడు భైంసా మండలంలోని సిరా ల ప్రాజెక్టు తెగిపోవడంతో ఆయకట్టు సాగుకు నోచుకోలేదు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడం, నీటి వినియోగం పెరగడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతున్నది. దీంతో నీరు అందక పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. దీనికితోడు భూగర్భజలాలు తగ్గడంతో బోర్ల నుంచి నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉండగా.. ఈ సమయంలో నీరు చాలా అవసరం. పంట చేతికి రావాలంటే నెల రోజులు పడుతుందని, మరో మూడు తడులు నీరు అవసరమని రైతులు పేర్కొంటున్నారు. చెరువులు, కాలువల కింద కూడా నీళ్లు పారక చివరి ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందని రైతాంగం వాపోతున్నారు. దీంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నీళ్ల సరఫరాపై ఆంక్షలు

నిర్మల్ జిల్లాలోని సరస్వతీ కెనాల్ పరిధిలోని స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి విడుదలపై అధికారులు ఆంక్ష లు విధించడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ నెల 25వ తేదీ నుంచి డి13 నుంచి డి52 వరకు నీటి విడుదలను నిలిపి వేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. దీంతో సోన్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్ మండలాల పరిధిలో సాగుకు నీళ్లు అందే అవకాశం లేదు. సుమారు 20 వేల ఎకరాల పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం పంట చేతికొచ్చే వరకు నీటిని ఇచ్చిందని రైతులు గుర్తు చేస్తున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల తెగుళ్లు సోకి ఆందోళన చెందుతున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం శాపంగా మారనుంది. ప్రభుత్వం ముందే క్రాఫ్ హాలీడే ప్రకటిస్తే.. తాము వరి వేసుకోకుండా ఆరుతడి పంటలు వేసుకునేవారమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట చేతికొవచ్చే వరకు నీటిని అందించాలని డిమాండ్ చేస్తున్నారు.



కుంటాల మండలంలోని అందకూర్‌లో ఎండిపోయిన పొలం



నీళ్లు లేక బోసి పోతున్న చెరువు